www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 డిసెంబర్ 2023
5
అన్నమయ్య

ప్రాంగణ ఎంపికల్లో 26 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది విద్యార్థులు ఉద్యోగాల పెంపకయ్యారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం చెన్నైకి చెందిన సదర్ ల్యాండ్ సంస్థ తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. 45 మంది బిసిఎ, బిఎస్‌సి విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా అందులో ప్రతిభ కనబరిచిన 26 మంది విద్యార్థులను ప్రోగ్రాం అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.మూడు లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, హెచ్‌ఆర్ గిరీష్, అధ్యాపకుడు మౌలాలి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో గురుప్రసాద్

కదం తొక్కిన అంగన్వాడీలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)తోపాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో అంగన్వాడీ సంఘాలు జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెబాట పట్టారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసనలు
సిఐటియు, ఎఐటియుసి మద్దతు

బి.కొత్తకోట : అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలన్నారు. రాజకీయ జోక్యం అరికట్టాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, అన్ని యాపులను ఒకే యాప్‌గా మార్చాలని పేర్కొన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలన్నారు. పెండింగులో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కృంచాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేస్తూ, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని కోరారు. **మదనపల్లె:** అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని ఎపి అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) అన్నమయ్య జిల్లా కమిటీ నాయకులు మధురవాణి, రాజేశ్వరి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు విజయ, గీత, భాగ్యమ్మ, సుబ్బలక్ష్మి, అకీరునిషా, గంగ, శైలజ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని సిఐటియు ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ అక్కచెల్లెమ్మలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ మర్చిపోయారని పేర్కొన్నారు. ఈ సమ్మెకు కార్మిక సంఘాలు, పజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఓబులమ్మ సెక్టార్ లీడర్లు శిరీష, రుక్మిణి, నాగమణి, వెంకటసుబ్బమ్మ, శ్రీవాణి, శారద, గౌరవ అధ్యక్షులు ప్రభావతి, జిల్లా యూనియన్ కమిటీ మెంబర్ ఫయాజ్, లక్ష్మీదేవి, నాగరాజమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** అంగన్వాడీ కేంద్రాలలో పనిచేసే కార్యకర్తలు మినీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కరుణశ్రీ, సులోచ, స్వరూప రాణి కోరారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.

మదనపల్లెలో చిన్నారులతో నిరసన చేస్తున్న అంగన్వాడీలు

లక్కిరెడ్డిపల్లె : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

రాజంపేట : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బి.కొత్తకోట : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

వేగవంతంగా అసైన్డ్ భూముల ఇకెవైసి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో పంపిణీ చేసిన అసైన్మెంట్ భూములకు సంబంధించి సదరు లబ్ధిదారుల ఇకెవైసి వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ముసాయిదా ఓటరు జాబితా సవరణ, రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఒలు, నియోజకవర్గ ఇఆర్ఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్మెంట్ భూముల పునఃపరిశీలన రికార్డులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి సర్క్యులర్ రాగానే కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇనాం భూముల డిజిటల్ సిగ్నేచర్ అంశాన్ని పూర్తి చేయాలన్నారు. చుక్కల భూముల వివరాలను ఆర్డిఓ లకు పంపుతామని వాటన్నిటిని నిబంధనల మేరకు పరిశీలించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ జాబితా సవరణకు సంబంధించి ఈ నెల 13లోగా ఇఆర్ఒ లాగిన్‌లో ఫారం7 జనరేట్ కావాలని నియోజకవర్గ ఎలక్ట్రోరోల్ ఎన్రోల్మెంట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాలో పిఎసి, డిఎసి అంశం పరిష్కారంలో భాగంగా నేటి సాయంత్రంలోగా షెడ్యూల్ చేసి రేపటికల్లా ఫారం7 జనరేట్ చేయాలన్నారు. ఈనెల 20 నాటికి ఫారం 7 దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని చెప్పారు. ఇందులో ఫార్మాట్ ఎ, చెక్ లిస్టులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఇంకను 26 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉందని నిర్ణీత సమయంలోగా వాటిని పరిశీలన పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. ఈనెల 9 నాటికి ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎన్ని దరఖాస్తులు ఉన్నాయో వాటి జాబితా తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కార చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటరు జాబితాకు సంబంధించి పిఎసి, డిఎసి ఆన్‌లైన్ నమోదు అంశంలో ఏదైనా సమస్యలుంటే వాట్సప్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఏడు రోజుల కంటే పైబడిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. 18-19 ఏళ్ల ఓటర్ల నమోదులో రాజంపేట, తంబళ్లపల్లి, మదనపల్లిలో ప్రగతి బాగుందని, మిగిలిన చోట్ల అర్హులైన యువ ఓటర్లందరూ తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు, ఇఆర్ఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

మూల్యాంకన పారితోషికం చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

2023 ఏప్రిల్‌లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం విధులలో పాల్గొని మార్కులు వేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రెమ్యునరేషన్ ఇంత వరకు చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటి అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్ జాబీర్ ప్రశ్నించారు. మంగళవారం ఇన్‌ఛార్జి డిఇఒ ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష పత్రాల వాల్యుయేషన్ పూర్తయి ఏడు నెలలు గడిచినప్పటికీ ఆయా విధుల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పూర్తిగా చెల్లింపులు జరగకపోవడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయని వాపోయారు. ఇదే విషయంపై అనేకసార్లు యుటిఎఫ్ పక్షాన సంబంధిత అధికారులు, గౌరవ డిఇఒను కలిసి విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ చెల్లించాలని లేనియెడల ఆందోళనకు పిలిపిస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దావూద్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షుడు హాఫీజుల్లా, సహాధ్యక్షులు రెడ్డి బసయ్య, ట్రెజరర్ రఫీ, వీరబల్లి మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు నాగార్జున అమీనుల్లా, చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, సహాధ్యక్షులు కిఫాయతుల్లా, నాయకులు సుబహాన్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

టిడిపి ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తున్న నల్లారి కిషోర్

పేదల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలను ఆర్థికంగా ఆదుకోవడానికి చంద్రబాబు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టనున్నారని తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం, ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని గుట్టపాలెం పంచాయతీలో మంగళవారం రెండవ రోజు దిగువ కంభంవారిపల్లి, సామగుంటవారిపల్లి, వైకె.పల్లి, వాడవాండ్లపల్లి ఎల్లంపల్లి గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవస్థలన్నీ తమ గుప్పెట్లో పెట్టుకొని టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ, ప్రజా స్వామ్యాన్ని అపహస్యంచేస్తూ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. నల్లారి కుటుంబం గత 50ఏళ్లుగా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, గ్రామగ్రామాన రోడ్ల సదుపాయం, మౌలిక వసతులు, పాఠశాలలు అందరి సంక్షేమమే నల్లారి కుటుంబ లక్ష్మని ప్రజలకు వివరించారు. నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి నల్లారి కుటుంబం సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరమణారెడ్డి, బయన్న, పి.రామయ్య, మునీంద్ర, నరసింహులు, బాలకృష్ణ, కరుణాకర్, విజయ్ కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కెజిబివి స్పెషల్ ఆఫీసర్‌గా నీరజ

ప్రజాశక్తి-గాలివీడు

కెజిబివి స్పెషల్ ఆఫీసర్‌గా నీరజ నియమితులయ్యారు. రెండేళ్లుగా కెజిబివిలో స్పెషల్ ఆఫీసర్ లేకపోవడంతో ఇన్‌ఛార్జితో కాలం గడుపుతున్నారు. ఆమె నియామకంతో విద్యార్థుల సమస్యలు పరిష్కరమవుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలో తెలుగు పండిట్‌గా, సిఆర్‌టిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై గాలివీడు మండలానికి వచ్చానని తెలిపారు. అందరి సహకారంతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తానని చెప్పారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రులు

మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సాధికార బస్సు యాత్ర మన్నూరు నుంచి పాత బస్టాండ్ వరకు భారీ జనసందోహం మధ్యన అట్టహాసంగా నిర్వహించారు. యాత్రకు ముందు తోట కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉండగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు రాజ్యాంగాన్ని అవమానించేలా దళితులను కించపరిచారన్నారు. నేడు జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రూ.2.40 లక్షల కోట్ల బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసి వారి తలసరి ఆదాయం పెంచారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనతో అన్ని వర్గాలలోనూ సమానత్వం వచ్చిందని, ఈ సమానత్వం వలన ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పదవుల్లో అందరితో సమానంగా కూర్చుంటారన్నారు. ప్రజలలోకి తాము ధైర్యంగా వస్తున్నామని తెలిపారు. జగన్ సామాజిక విప్లవం భావితరాలకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక సాధికార విషయంలో ఏ ప్రభుత్వం తీసుకొని సాహసోపేతమైన నిర్ణయాలు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని తెలిపారు. మంగళగిరిలోను ఒడిసికె అవకాశం ఇస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రజలకు న్యాయం కావాలన్నా, గ్రామస్థాయి నుంచి అభివృద్ధి తీసుకురావాలన్నా రానున్న ఎన్నికలలో మరల జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వివరించారు. రెండు కఫాలు రాజంపేట ఎమ్మెల్యేగా మేడా మల్లిఖార్జునరెడ్డిని ఆదరించారని మరో మారు కూడా ఆయనను ఆదరించి అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం పాత బస్టాండు కూడలిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి నేతలు ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యోగేశ్వర్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిడిఎస్ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

- నిరవధిక సమ్మెలోకి జిడిఎస్ ఉద్యోగులు

ప్రజాశక్తి-పీలేరు

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు మేరకు సీనియర్ జిడిఎస్ ఉద్యోగుల రూ.12,24,36 సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని జిడిఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. తిరుపతి డివిజన్ పరిధిలోని పీలేరు బ్రాంచ్ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంయుక్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. జిడిఎస్ ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం పీలేరు ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎఐజిడిఎస్ యూనియన్ పీలేరు సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్.ఖాదర్ బాషా, అధ్యక్షులు మస్తాన్ మాట్లాడుతూ అశాస్త్రీయమైన, ఆచరణకు సాధ్యంకాని లక్ష్యాల కోసం జిడిఎస్‌లను వేధించడం, వారిపై ఒత్తిడి చేయడం ఆపివేయాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవును 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని, జిడిఎస్ ఉద్యోగుల సామూహిక బీమా రూ.5 లక్షల వరకు మంజూరు చేయాలని, అలాగే మెడికల్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, తమను సివిల్ సర్వెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, ఇన్సెంటివ్ కమీషన్ పద్ధతి రద్దు చేసి, జిడిఎస్ చేసే ప్రతి పనిని వర్క్ లోడ్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు తపాలా కార్మికుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి రాధాకృష్ణయ్య, గోరంట్ల శ్రీనివాసరావు, అయూబ్, సతీష్, సయ్యద్ బాష, లక్ష్మీపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు తపాలా కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న జిడిఎస్ ఉద్యోగులు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బలిజ జెఎసి నాయకులు

17న శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె

నీటికోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి సముద్రాల లాంటి చెరువులు తవ్వించి నీటి నిల్వలు చేసి ప్రజలను ఆదుకున్న విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు అందరివాడని బలిజ జెఎసి నాయకులు పేర్కొన్నారు. మండలంలోని బసినికొండ వై జంక్షన్ వద్ద మంగళవారం శ్రీకృష్ణ దేవరాయలు కాంస్య విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 17న నిర్వహించే శ్రీకృష్ణ దేవరాయలు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బలిజ కులస్తులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలంటూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు కాంస్య విగ్రహావిష్కరణతో ఏళ్లనాటి బలిజల కళ నెరవేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లె శ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, టిటిడి మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్, కర్ణాటక నుంచి జయరామయ్య తోపాటు ఇతర ముఖ్య నేతలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బలిజ కులస్తులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలంటూ నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ జెఎసి నాయకులు వైఎస్. మునిరత్నం, కత్తి రాజు, నాగరాజ, ఆంజనేయ ప్రసాద్, బివి.రమణ, ఆకుల కృష్ణమూర్తి, చంద్రశేఖర్, అండే శివప్రసాద్, ప్రసాద్, జయరాం, భాస్కర్ పాల్గొన్నారు.

విత్తనాల నిల్వ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

రైతులు పండించిన విత్తనాలను నిల్వ ఉంచడానికి గోడౌన్‌ను ఏర్పాటు చేస్తునట్లు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో గ్రూపులుగా ఉన్న రైతులు తమ విత్తనాలు కొనుగోలు చేసి నిల్వ ఉంచడానికి ఉపయోగంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పది మంది రైతులు గ్రూపుగా ఏర్పడితే తాము పండించే పంటలను నిల్వ చేసుకునేందుకు గోడౌన్ ఏర్పాటు చేసేందుకు హార్టికల్చర్ వారు అవకాశాన్ని కల్పించారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మాణంలో ఉన్న విత్తన నిల్వ కేంద్రం

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : సర్పంచ్

ప్రజాశక్తి-పుల్లంపేట

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు చెత్తను తొలగించడం వీధులలో బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించామని తెలిపారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఊరి బయటకు తరలించారు. శీతాకాలం కావడం చేత నెమ్ము వాతావరణ పరిస్థితులు ఉండడం వలన ఈగలు, దోమలు అధికమై వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందువలన ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మించాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పారిశుధ్యం పైన ప్రధాన దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించగలుగుతారన్నారు. ఇంటి ముందు మురుగు, నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. పల్లెలో అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాటిన వాటిని సంరక్షించుకోవాలని తెలియజేశారు. పీల్చే గాలి తినే తిండి తాగునీరు శుభ్రంగా ఉంటే ఏ రోగాలు దరిచేరవని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కలకడ

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగే జాగ్రత్తగా ఉండాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జవహర్ బాబు ఆధ్వర్యంలో ఆషాడే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆశా డే ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ సర్వే ప్రతి గ్రామంలో సర్వేలు నిర్వహించాలని, ప్రతి సచివాలయంలో ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పి ఈనెల 15వ తేదీ లోపల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నివేదిక సమర్పించాలని తెలిపారు. మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో ఉపకేంద్రవారీలుగా రోజు క్రమం తప్పకుండా, అవుట్ రిచ్ సెషన్స్ పిల్లలకు, గర్భిణులకు వ్యాక్సిన్ వేసి పూర్తిచేయాలని సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వర్షాకాలం గ్రామాలలో దిబ్బలు, మురికి నీటి నిలువ గుంతలు, తొట్టెలు, టెంకాయ బొచ్చెలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లు క్లీన్ చేయించాలని తెలిపారు. డ్రమ్ములలో నీటి నిలువలను తొలగించాలన్నారు. వాటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు ఆశా కార్యకర్తలకు హెచ్‌బిఎన్‌సి, హోమ్ బేస్డ్ న్యూ బర్న్ కేర్ అనగా 03 వరోజు 07 రోజు 14వ రోజు 21వ రోజు 28వ రోజు 32వ రోజు 42 రోజు అలా 07 పర్యాయాయాలు బాలింత సంరక్షణ చేయాలి. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఎంఎల్‌హెచ్‌పిలు రాజ సులోచన, జెఎస్ గోపికృష్ణ, కనకమ్మ, లావణ్య, అశ్విని, ఆరోగ్య కార్యకర్తలు, వాణి, శ్రీలక్ష్మి, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇవిఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న పద్మావతి

ఇవిఎంల పనితీరుపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఇవిఎంల పనితీరుపై, ఎంఇఒ పద్మావతి ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని తవళం, నిమ్మనపల్లె, అడుసుపల్లె, కొండయ్యగారిపల్లె, పోలింగ్ కేంద్రాలకు వెళ్లి, స్థానిక ప్రజలకు, నాయకులకు ఈవీఎంలు పనిచేసే విధానంపై మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఓటు ఎలా వేయాలి, ఓటు నిర్ధారణ, గురించి వివరించారు. ఈవిఎం ల పై ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలన్నారు. ప్రతి ఓటరు ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉన్నప్పుడే, నాణ్యతతో కూడిన పోలింగ్ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సిరాజుద్దీన్, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

స్థానిక పోలీస్ స్టేషన్‌ను మదనపల్లి డిఎస్‌పి కేశప్ప మంగళవారం తనిఖీ చేశారు. నిమ్మనపల్లి స్టేషన్‌కు చేరుకున్న ఆయన రికార్డులు పరిశీలించారు. వివిధ కేసుల దర్యాప్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణపై పలు సూచనలు చేశారు. రాత్రివేళ గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. మండలంలో నాటు సారా తయారీ అధికంగా ఉందని, కర్ణాటక మద్యం, నాటు సారా అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కమిషనర్ పి.ఆర్.మనోహార్ సూచన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బిసి కాలనీలోని 3వ సచివాలయం పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు రూ.40,48,69,116 లబ్ధి పొందారు. ఈ జాబితాను సచివాలయంలో ప్రదర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాల బుక్ లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు వర్తించకపోతే సంబంధిత సచివాలయ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ఆర్ఐ శ్రీనివాసులు సచివాలయ ఉద్యోగులు కన్వీనర్లు పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న కమిషనర్ మనోహార్

వాల్టా..ఉల్టా..!

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
విచ్చలవిడిగా చెట్ల నరికివేత
ఎవరికీ పట్టని చట్టం
మామూళ్ల మత్తులో అటవీ అధికారులు

అక్రమార్కులు నరకడంతో మోడువారిన చెట్టు

ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా చేస్తున్న కలప

ప్రజాశక్తి-రామసముద్రం

అనుమతి లేకుండా ఒక్క చెట్టును కూడా నరకకూడదు. చెట్టును నరకాలంటే దానికి అధికారుల అనుమతి తీసుకోవాలి. తొలగించిన చెట్టుకు బదులుగా మరో చెట్టు వేయాలి. నీటి వనరుల నాశనం కాకుండా వాటి సంరక్షణకు నిర్మాణాలు చేపట్టాలి. మండల స్థాయిలో కమిటీలు నెలకోసారి సమావేశమై చట్టం అమలును పర్యవేక్షించాలి. ఇవీ స్థూలంగా ఎపి వాల్టా చట్టం (ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్-2004) నిబంధనలు. మండలంలో చట్టానికి తూట్లు పొడిచేలా కొందరు అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం మామూళ్ల మత్తులో జోగుతూ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

"చెట్లుంటే క్షేమం.. లేకుంటే క్షామం, చెట్లు వానలకు పిలుపు, పర్యావరణ పరిరక్షణకు చెట్లే మూలం, ప్రాణ వాయువుకు చెట్లే ఆధారం" అంటూ నినాదాలు వినిపిస్తున్నా, ఉన్న చెట్లను కాపాడుకుంటూ ప్రతి ఇంటికి ఓ చెట్టు నాటి పచ్చదనాన్ని పెంచాలని ప్రభుత్వాలు ప్రజలకు పిలుపునిస్తున్నా అవి కొంతమంది స్వార్థపరుల చెవుల్లో పడ్డం లేదు. కనీసం పర్యావరణ పరిస్థితులు కూడా వారి దృష్టికి ఆనడం లేదు. కొందరు స్వార్థ పరులు వాల్టా చట్టానికి సైతం తూట్లు పొడుస్తున్నారు. స్వలాభాపేక్షతో వ్యాపారులు పొలాల గట్టునుండే చెట్లను నరికించి వారి వ్యాపారాలను 'మూడు పువ్వులు ఆరు కాయలు' అన్న చందంగా మార్చుకుని అక్రమ కలప రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. పీలేరు పట్టణ పరిసరాల్లోని ఇటుక బట్టీలకు అవసరమైన కలప వినియోగం కోసం తరలిస్తున్నా, మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు అటవీ శాఖ ఉద్యోగులకు అవి కనబడ్డం లేదు. ప్రతిరోజూ స్థానిక రహదారుల్లో కలప లోడ్ల ట్రాక్టర్లు నడుస్తున్నా వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదని కొందరు పర్యావరణ ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే దానికి వారు సమాధానం కూడా ఇవ్వకుండా అక్కడి నుంచి చల్లగా జారుకుంటున్న పరిస్థితులు నెలకున్నాయన్న విమర్శలు పట్టణంలో వినిపిస్తున్నాయి.

అటకెక్కిన వాల్టా చట్టం

ఎపి వాల్టా 2004 చట్టంలోని రూల్ నంబరు 24 ప్రకారం చెట్లు తొలగించాలంటే, మండల స్థాయిలో అయితే తహశీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. ఏ ప్రాంతంలో చెట్లను తొలగిస్తున్నారో పేర్కొనాలి. నివాస, వాణిజ్య ప్రాంతాలు, వ్యవసాయం, పారిశ్రామిక ప్రాంతం పేర్లను స్పష్టం రాయాలి. ఆయా ప్రాంతాల్లో ఎన్ని చెట్లు ఉన్నాయి, ఎన్ని పడగొడుతున్నారు, ఏయే వృక్ష జాతులు ఉన్నాయనేది దరఖాస్తులో పొందుపరచాలి. చెట్లను పడగొట్టడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలి.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష : 'చింతల'

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుట్టపాలెం పంచాయితీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల పాల్గొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ఎల్లంపల్లి ఆచార్ల గొల్లపల్లిలో వాటర్ ప్లాంట్లను, సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాయని, అర్హులైన వారికి ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, అమ్మ ఒడి, చేయూత మొదలగు పథకాలు ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే నగదు జమ అయిందని, దాంతో ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మరొకసారి వైసిపికి ఓటు వేసి మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీకాంత్, సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేయడం తగదు

- ఆర్‌టిసి డిపో గేటు వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్థానిక ఆర్‌టిసి డిపోలో అధికారులు కార్మికులను వేధింపులకు గురి చేయడం తగదని ఎపిఎస్‌ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ఏహియాబాష అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం ఎర్ర రిబ్బన్లు ధరించి గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ సంస్థలోని అధికారులు గతం లాగే వేధింపులకు గురి చేస్తున్నారని, ఏదైన పొరపాటు జరిగితే 2019 సర్కులర్ ప్రకారం అప్పీల్ చేయడానికి అవకాశం ఉన్నా కూడా సర్కులర్‌ను తుంగలో తొక్కి ఛార్జ్ షీట్ దాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న కార్మికులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలు అందించాలని కోరారు. క్రమశిక్షణ చర్యలతో సిబ్బందిపై వేధింపులు ఆపాలని, ఇంక్రిమెంట్లను, ఓటి అలవెన్స్‌లను సకాలంలో అందించాలని కోరారు. అనారోగ్యం కారణంగా నిరాకరించిన సిబ్బందికి గతంలో మాదిరిగానే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షులు ఆర్.వి.గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల నాథ్, సిసిఎస్ డెలికేట్ ఎస్.పి.బాబు, గ్యారేజ్ కార్యదర్శి హరిబాబు, ట్రాఫిక్ కంట్రోలర్ వి.ఆర్ చంద్రయ్య, గంగాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

మెమొంటోలతో విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

డైట్ కళాశాలలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను మంగళవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను వెలికితీసే మంచి వేదిక కళా ఉత్సవ్ అని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శాస్త్రీయ, సంప్రదాయ, జానపద పాటల పోటీలు, శాస్త్రీయ, జానపద, నృత్య పోటీలు, వాయిద్య పోటీలు, ఏకపాత్రాభినయం, బొమ్మల తయారీ పోటీలు, చిత్రలేఖనం మొదలగు పోటీలు నిర్వహించారు. మొత్తం 10 కళా విభాగాల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ పోటీలలో విద్యార్థులు ఎవరికి వారే పోటాపోటీగా తమ కళారూపాలని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళా ఉత్సవ్ కో-ఆర్డినేటర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం నేర్పిస్తే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను చాటి చెప్పేందుకు వేదికవుతుందన్నారు. వివిధ విభాగాలలో 13 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. ఈ 13 మంది విద్యార్థులు ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళా ఉత్సవ ఇన్‌ఛార్జి అసదుల్లాబాష తో పాటు అధ్యాపకులు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి : 'గడికోట'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే గడికోటశ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎంపిపి సభాభవనంలో మండల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై మండల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి సమీక్షించారు. తాగునీటి ఎద్దడి ఏయే గ్రామాలలో నెలకొని ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. జెజెఎం నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్ట్ ఎవిఎల్‌సి అంశాలపై చర్చించారు. మండలంలోని పాఠశాలల్లో నాడు నేడు క్రింద చేపట్టిన అభివృద్ధి పనులలో వేగం పెంచాలని ఎంఇఒలకు సూచించారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుచుండడంతో ఎంఈఓ లు పర్యవేక్షణ చేపట్టి ఉపాధ్యాయులకు నాన్యమైన విద్యను అందేలా చూడాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్యం అందించాలని దేవలం పల్లె, కోణంపేట వైద్యాధికారులుకు సూచించారు. ఒపి సేవలను పెంచాలని, సాధారణ కాన్పులు ఎక్కువగా జరగాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిలో కూడా ఓపి సేవలును, సాధారణ కాన్పులును పెంచాలని సూచించారు. లక్కిరెడ్డిపల్లె సిహెచ్సి లో రోగులకు మెరుగైన వసతులు కల్పించి, ఒపిని పెంచాలనీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ భరణికి సూచించారు. రైతులను ఏ విషయంలో తిప్పుకోకండని రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలో ఇనాం భూములు, చుక్కల భూములు, అసైన్ మెంట్ భూముల పంపిణీని గ్రామాల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అసైన్ మెంట్ పట్టాలను శనివారం లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎంపిడిఒ వెంకట్రామి రెడ్డి, వైస్ ఎంపిపిలు సమర సింహారెడ్డి, సుబ్బరాయుడు, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, విజయ భాస్కర్, రవి ఆచారి, సాదుల్ల, ఎంపీటీసీలు దస్తగిరి, లక్ష్మినారాయణ, జగన్ మోహన్ రెడ్డి,శంకర్ నాయుడు, సర్పంచులు సిద్ధక నాగిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సలహా సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, గజేంద్రా రెడ్డి, మాజీ సర్పంచులు కొండా ప్రసాద్ రెడ్డి, వెంకటాద్రి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరు పంచాయతీ సర్పంచ్ జీనత్ షఫీ తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గం పీడీ, పిఇటి, డిజిటల్ సహాయకులు, వాలంటీర్లకు ఆన్లైన్ స్కోరింగ్ యాప్ నిర్వహణపై ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్, రాయచోటి టెక్నికల్ గైడ్ అజహర్ అలీ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. క్రీడాకారులకు గ్రేటింగ్ ఇవ్వడంలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ఆన్లైన్ స్కోరింగ్ స్కోరింగ్ విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. ఆన్లైన్లోనే స్కోరింగ్ కూడా చూసుకునే అవకాశం కూడా ఉందని తెలియజేశారు. సమావేశంలో ఎంపిడిఒ డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, వైసిపి రైతు విభాగం నాయకులు కె.భాస్కర్‌రెడ్డి, పీడీ, పిఇటి, డిజిటల్ సహాయకులు, వాలం టీర్లకు పాల్గొన్నారు.

ప్రతి సంఘం ఒక బ్యాంకు కావాలి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని వెలుగు సభ భవనంలో మంగళవారం నాబార్డు ఐబిపిఇ సత్యభామ ఆధ్వర్యంలో సంఘాల బలోపేతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలు బలోపేతం చేసుకొని పొదుపును సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రతి గ్రూపు సంఘం కూడా ఒక మహిళ బ్యాంకు కావాలని తెలిపారు. ప్రతి గ్రూపు కూడా సమయానికి తీసుకున్న సొమ్మును సకాలంలో బ్యాంకులో జమ చేయాలన్నారు. ప్రతి మహిళ కూడా పొదుపు సంఘాలలో ఉండి ఒక బ్యాంకు వలె గ్రూపు తయారవ్వాలని తెలపారు. కార్యక్రమంలో ఏపీ నిరంజన్, డిపిఎంఐ బి.వేణు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా కిట్లను సరఫరా చేస్తున్న ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులుల్లో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాని శ్రీకారం చుట్టిందని ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లను మంగళవారం మండలంలోని సచివాలయాలకు సరఫరా చేశారు. వాలీబాల్, బ్యాట్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖోకు సంబంధించిన కిట్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పాండురంగన్, పంచాయతీ కార్యదర్శులు క్రాంతి, వెంకట్రమణ, సుమియా, వాలంటీర్ శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సురేంద్రనాథ్

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

ప్రజాశక్తి తంబళ్లపల్లి

గ్రామ పంచాయతీలలో ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు వెంటనే స్పందించాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ కోరారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగే జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి, కలెక్టర్ గిరీష, అధికారులు హాజరవుతారన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పర్యటించాలన్నారు. అప్పుడే సమస్యలు దృష్టికి వస్తాయన్నారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎఒ ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సాధికారతపై మాట్లాడే అర్హత వైసిపికి లేదు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సామాజిక సాధికారతపై మాట్లాడే అర్హత అధికార వైసిపి ప్రభుత్వానికి లేదని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆరోపించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేటలో వైఎస్ఆర్సిపి నాయకులు సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ ఎందుకు నిర్వహించారో అర్థం కావడం లేదన్నారు. అసలు సామాజిక సాధికారత అంటే వైసిపి మంత్రులకు అర్థం తెలుసా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో పేరుకు మాత్రమే 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేకుండా చేసిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, సీనియర్ నాయకులు జివి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రైతులకు తీరని అన్యాయం :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : వైసిపి నాలుగున్నర సంవత్సరాల పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పడిపోయిన అరటి తోటలను రాజంపేట అబ్జర్వర్ నెట్టెం వెంకటేశ్వర్లు, రైల్వేకోడూరు అబ్జర్వర్ వి.హేమాంబరధర రావు, రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి డాక్టర్ సుధాకర్, కోడూరు అసెంబ్లీ తెలుగు రైతు అధ్యక్షులు నాగినేని వెంకటరమణ, రాజంపేట అసెంబ్లీ తెలుగు రైతు అధ్యక్షులు పొట్టేటి వెంకటసుబ్బారెడ్డిలతో కలిసి సందర్శించారు. పెద్దకారంపల్లి, హస్తివారి పల్లి, హెచ్.కొత్తపల్లి, గుండాలపల్లి, బ్రాహ్మణపల్లి, చవనవారిపల్లి, కొల్లవారిపల్లె గ్రామాలలో పర్యటించి రైతులతో మాట్లాడి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తుఫాను వల్ల పలు గ్రామాల్లో సుమారు 2000 ఎకరాలు తీవ్రంగా నష్టపోతే వైసిపి ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

అరటి తోటలను పరిశీలిస్తున్న బత్యాల చెంగల్రాయులు